క్లుప్తంగా

వాటర్ ప్లాంట్లలో తనిఖీ



నెక్కొండ : మండల కేంద్రంలోని మినరల్ వాటర్ ప్లాంట్లలో గురువారం తనిఖీ చేశారు. 'మినరల్ వాటర్‌లో తోకపురుగులు' శీర్షికతో ఈనెల 24న 'సాక్షి'లో ప్రచురితమైన వార్తపై తహసీల్దార్ రాజ్‌కుమార్ స్పందించారు. ఈ క్రమంలో గురువారం మండల కేంద్రంలోని అప్నా బజార్ స్ట్రీట్, బీసీ కాలనీల్లోని వాటర్ ప్లాంట్లను తనిఖీ చేశారు. వాటర్ శాంపిళ్లను సేకరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రాజ్‌కుమార్ మాట్లాడారు. వాటర్ ప్లాంట్ల నిర్వాహకులు ప్రజలకు నాణ్యమైన నీటినే అందించాలని స్పష్టం చేశారు. శాంపిళ్లను ల్యాబ్‌కు పంపుతామని, నివేదిక ఆధారంగా చర్యలు ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో ఆర్‌ఐ నరేందర్, స్థానిక గ్రామ పంచాయతీ ఈఓ సదానందం, తదితరులు పాల్గొన్నారు.

ఖైరతాబాద్ ఎన్నికల పరిశీలకురాలిగా సౌజన్య



రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్‌తో సౌజన్య (ఫైల్)

గీసుకొండ : మాజీ ఎంపీపీ, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి భీమగాని సౌజన్య కాంగ్రెస్ సంస్థాగత ఎన్నికల ఖైరతాబాద్ జిల్లా పరిశీలకురాలిగా నియమితులయ్యారు. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్ పేర ఉత్తర్వులు వెలువడ్డాయి. రాష్ట్ర సంస్థాగత ఎన్నికల పరిశీలకులుగా ఆరుగురు మహిళలు నియమితులు కాగా వరంగల్ నుంచి సౌజన్య ఉండడం విశేషం. సౌజన్య ఇప్పటికే పలు జిల్లాల కోఆర్డినేటర్‌గా వ్యవహరించారు.

బస్సులో పోగొట్టుకున్న సొమ్ము అప్పగింత

నర్సంపేట : స్థానిక ఆర్టీసీ డిపో బస్సులో ప్రయాణికురాలు పోగొట్టుకున్న సొమ్మును కండక్టర్ వైపీ.కుమార్, డ్రైవర్ సీహెచ్.శంకర్ బాధితురాలికి అప్పగించి నిజాయితీ చాటుకున్నారు. వివరాలిలా.. నర్సంపేట నుంచి ఆదిలాబాద్‌కు వెళుతున్న ఎక్స్‌ప్రెస్‌లో ఉట్నూరు వద్ద యాస్మిన్ సుల్తాన్ ఎక్కి ఆదిలాబాద్‌లో దిగిపోయింది. ఈ క్రమంలో ఆమె తను కూర్చున్న సీట్లోనే రూ.1740 నగదుతోపాటు ఆధార్ కార్డులున్న పర్సు మర్చిపోయింది. గమనించిన కండక్టర్ కుమార్.. డ్రైవర్ శంకర్‌తో కలిసి ఆదిలాబాద్ సెక్యూరిటీ విభాగంలో ఏడీసీకి అప్పగించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



పర్వతగిరి : మండల కేంద్రానికి చెందిన పెండ్యాల యాదగిరికి మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కును కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జాటోతు శ్రీనివాస్‌నాయక్ గురువారం అందజేశారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడారు. యాదగిరి అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స చేయించుకోగా వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు చొరవ తీసుకుని సీఎం సహాయ నిధి నుంచి సాయం మంజూరు చేయించారని తెలిపారు.

నర్సింగ్ విద్యార్థులకు వీడ్కోలు

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని లక్నెపల్లి శివారులోని బాలాజీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ నర్సింగ్ కళాశాలలో విద్యాభ్యాసం పూర్తి చేసుకున్న విద్యార్థులకు జూనియర్లు గురువారం ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా నిర్వహించిన వేడుకలను బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ రాజేంద్రప్రసాద్‌రెడ్డి, కోశాధికారి ట్రెజరర్ డాక్టర్ వనజ ప్రారంభించగా విద్యార్థులకు వారికి పూలబొకేలు అందించి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం డాక్టర్ రాజేంద్రప్రసాద్ రెడ్డి మాట్లాడారు. విద్యార్థులు ఉన్నతులుగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో విద్యాసంస్థల కార్యదర్శి డాక్టర్ రాజేశ్వర్‌రెడ్డి, ఏఓ సురేశ్, అకడమిక్ కోఆర్డినేటర్ నారాయణ, ప్రిన్సిపాల్ భానురేఖ, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

నర్సంపేట రూరల్ : చికిత్స పొందుతున్న యువకుడు మృతి చెందాడు. వివరాలిలా.. మాదన్నపేటకు చెందిన పి.అశోక్ (36) కూరగాయలు అమ్ముకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈనెల 7న కూరగాయలు అమ్మేందుకు ద్విచక్ర వాహనంపై వెళ్లి గాలివాన, ఈదురుగాలులు రావడంతో రాత్రి అక్కడే వేచి చూసి ఆలస్యంగా ఇంటికి బయలుదేరాడు. ఈ క్రమంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడిపోగా తలకు గాయమైంది. వరంగల్‌లోని ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా గురువారం మృతి చెందాడు. మృతుడికి భార్య రజిత, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

చెక్‌డ్యాంల నిర్మాణం పూర్తయ్యేదెన్నడో..?

- మూడు చోట్ల అసంపూర్తిగా..
- కాంట్రాక్టర్లు, అధికారుల నిర్లక్ష్యం



అశోక్‌నగర్ శివారులో నిర్మాణ దశలో ఉన్న చెక్‌డ్యామ్

ఖానాపురం : రైతులకు సాగునీరు అందించే ఉన్నత లక్ష్యంతో చేపట్టిన చెక్‌డ్యాంల నిర్మాణం పూర్తయ్యేదెన్నడో..? అంటూ సర్వత్రా అసహనం వ్యక్తం అవుతోంది. సంవత్సరాలు గడుస్తున్నా కాంట్రాక్టర్లు, అధికారుల నిర్లక్ష్యంతో మండలంలోని మూడు చోట్ల చెక్‌డ్యాంల నిర్మాణం అసంపూర్తి దశలోనే వెక్కిరిస్తోందంటే అతిశయోక్తి లేదు. వాగు ద్వారా వృథా పోతున్న నీటిని ఒడిసిపట్టేందుకు చెక్‌డ్యాంలు దోహదపడతాయని రైతులు ఆశించగా కాంట్రాక్టర్లు మోసపూరిత విధానాలు, అధికారులు నామమాత్రపు నోటీసులతో నిర్లక్ష్యం చేస్తున్నారంటూ రైతులు, మండల ప్రజలు మండిపడుతున్నారు. ఇకనైనా ప్రభుత్వం, ఎమ్మెల్యే, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు స్పందించి చెక్‌డ్యాంల నిర్మాణం పూర్తై రైతులకు లబ్ధి చేకూరాలని స్థానికులు ఆశిస్తున్నారు.

మండలంలోని ధర్మరావుపేట, అశోక్‌నగర్, ఖానాపురం శివార్లలో పాకాల వాగుపై గతంలో నాటి ప్రభుత్వం చెక్‌డ్యాంల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. చెక్‌డ్యాంల నిర్మాణంతో రైతులు సాగు చేసుకునే పంటలకు నీరు అందించడానికి నాటి ఎమ్మెల్యే ప్రణాళికాయుతంగా నిర్మాణాలు చేపట్టినట్టు వ్యాఖ్యలు వినవస్తున్నాయి. మూడు చెక్‌డ్యాంలకు ప్రభుత్వం రూ.10 కోట్ల నిధులు మంజూరు చేసింది. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు నిర్మాణాలు చేపట్టారు. పనులు ప్రారంభించి వదిలేశారు. సంవత్సరాలు గడుస్తున్నా నిర్మాణాలు ముందుకు సాగడం లేదు. గతంలో పర్యవేక్షించిన ఇరిగేషన్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోపాటు కాంట్రాక్టర్లు సైతం ఇష్టారాజ్యంగా నిర్మాణాలు చేపట్టి అసంపూర్తిగా వదిలేశారని పలువురు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. చెక్‌డ్యాంల నిర్మాణం పూర్తి కాకపోవడంతో రైతులకు లబ్ధి చేకూరని దుస్థితి నెలకొంది. ఇకనైనా ఇరిగేషన్ శాఖ జిల్లా స్థాయి అధికారులు స్పందించి చెక్‌డ్యాంల నిర్మాణంలో నాణ్యత, జాప్యంపై సమగ్ర విచారణ చేపట్టి నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులు, కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవడంతోపాటు నిర్మాణాలు పూర్తి చేయించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

నిర్మాణంలో జాప్యంతో నష్టం

పాకాల ఆయకట్టు కింద మండల పరిధిలోని సుమారు 18 వేల ఎకరాలు సాగవుతున్నాయి. చెక్‌డ్యాంల నిర్మాణం పూర్తైతే ఒక టీఎంసీ నీరు నిల్వ ఉండడంతోపాటు భూగర్భజలాలు పెరుగుతాయి. అలాగే వేసవిలో పాకాల సరస్సులోకి గోదావరి జలాలు రాకపోతే సుమారు 2–3 వేల ఎకరాలకు సాగునీరు చెక్‌డ్యాంల నుంచి నీరు అందుతుంది. పాకాల వాగుపై సరైన ప్రణాళికతోనే చెక్‌డ్యాంల నిర్మాణం చేపట్టారు. జాప్యం వల్ల రైతులకు నష్టం వాటిల్లడం ఖాయం.

\- వేములపల్లి ప్రకాశ్‌రావు, మాజీ ఎంపీపీ

త్వరలో పూర్తి చేయిస్తాం

చెక్‌డ్యాంల నిర్మాణం అసంపూర్తిగా ఉన్న విషయం వాస్తవమే. ధర్మరావుపేట శివారులో చేపట్టిన చెక్‌డ్యామ్ నిర్మాణం చివరి దశలో ఉంది. మిగతా రెండు చోట్ల నిర్మాణాలు అసంపూర్తిగానే ఉన్నాయి. వాగు ద్వారా నీరు వస్తుండడంతో పనులు చేయడం లేదని భావిస్తున్నాం. పనులు పూర్తి చేయాలని గతంలోనే అధికారులు నోటీసులు ఇచ్చారు. మే నెలాఖరు నాటికి వరకు పనులు పూర్తి చేయించే దిశగా చొరవ తీసుకుంటాం. రైతులకు లబ్ధి చేకూరేలా కృషి చేస్తాం.

\- సంతోశ్‌కుమార్, డీఈ, ఇరిగేషన్ శాఖ

జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం



ఖానాపురం : ప్రతిజ్ఞ చేయిస్తున్న కార్యదర్శి రజిత



నల్లబెల్లి : సమ్మక్కను సన్మానిస్తున్న అధికారులు

నెక్కొండ : జాతీయ పంచాయతీ దివస్‌ను పురస్కరించుకుని మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో గురువారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సభకు ముఖ్యఅతిథిగా డీఎల్‌పీఓ రాజీవ్‌కుమార్ హాజరై మాట్లాడారు. పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో జరిగే పనులు, చట్టాలపై వివరించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేస్తేనే గ్రామాలు సమగ్రాభివృద్ధి చెందుతాయని స్పష్టం చేశారు. గ్రామాల అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. అనంతరం గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. సమావేశంలో స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీశ్‌రెడ్డి, గ్రామ పంచాయతీ ఈఓ సదానందం, తదితరులు పాల్గొన్నారు.

వర్ధన్నపేట : మండలంలోని ఉప్పరపల్లిలో శ్రీమణికంఠ, కాకతీయ గ్రామైక్య సంఘాల ఆధ్వర్యంలో జాతీయ పంచాయతీ దివస్ కార్యక్రమం గురువారం నిర్వహించారు. తొలుత పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేశారు. అనంతరం డీఆర్‌డీఏ కమ్యూనిటీ కోఆర్డినేటర్ గోలి కొమురయ్య మాట్లాడారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలని సూచించారు. చెత్తాచెదారాన్ని ఇంటి పరిసరాల్లో వేయకుండా అవగాహన కల్పించడంలో మహిళా స్వయం సంఘాల సభ్యులు శ్రద్ధ తీసుకోవాలని కోరారు. నూరు శాతం ఇండ్లలో మరుగుదొడ్లు ఉండాలని, బహిరంగ మలమూత్ర విసర్జనపై ప్రజాచైతన్యం కీలకమని చెప్పారు. ఇళ్లలో ఇంకుడు గుంతలు నిర్మించి భూగర్భ జలాలు పెంచాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సహజ, ఆశ కార్యకర్తలు ఏఓ అధ్యక్ష, కార్యదర్శులు కట్ట రజిత, భవానీ, అనిత, నాగలక్ష్మి, వీఓఏలు రోజ, మమత, తదితరులు పాల్గొన్నారు.

ఖానాపురం : మండలవ్యాప్తంగా పంచాయతీ కార్యాలయాల్లో సభలు నిర్వహించారు. ఉపాధి హామీ పనుల ప్రదేశాలకు అధికారులు, సిబ్బంది వెళ్లి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమాల్లో పంచాయతీ కార్యదర్శులు రజిత, అబేద, యుగేందర్, స్రవంతి, హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

నల్లబెల్లి : మండలంలోని రేలకుంట పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సుమారు 20 ఏళ్లుగా వేతనం తీసుకోకుండా స్వచ్ఛందంగా పారిశుద్ధ్య కార్మికుడిగా సేవలు అందించిన కొత్తూరు మల్లయ్య చిత్రపటానికి స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ వేణు, అధికారులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మల్లయ్య సతీమణి సమ్మక్కను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ వేణు మాట్లాడారు. మల్లయ్య సేవలు మరువలేనివని కొనియాడారు. ఆయన మృతి బాధాకరమన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.

పర్యాటకులపై దాడి అమానుషం



నర్సంపేట రూరల్ : కోర్టులో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

- బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రవి

నర్సంపేట రూరల్ : జమ్ముకాశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులపై ఉగ్రవాదులు దాడి చేయడం అమానుషమని నర్సంపేట బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మోటూరి రవి అన్నారు. ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోర్టు ఆవరణలో న్యాయవాదులు గురువారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. విధులను బహిష్కరించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడారు. దుండగులను కఠినంగా శిక్షించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు షేక్ రహీముద్దీన్, పుట్టపాక రవి, కోశాధికారి దాస్యం రంగానాథస్వామి, ఈసీ మెంబర్లు బొద్దుపెల్లి అజయ్, న్యాయవాదులు గూళ్ల ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

నల్లబెల్లి : మండలంలోని రుద్రగూడెంలో సీపీఎం ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో శాంతిర్యాలీ నిర్వహించారు. మృతులకు నివాళులర్పించారు. అనంతరం ఆ పార్టీ మండల కార్యదర్శి కడియాల మనోహర్ మాట్లాడారు. ఉగ్రవాదుల దాడిని సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు ముక్తకంఠంతో ఖండించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు గంగారపు లింగయ్య, వక్కల శివ, బేతి భరత్, దూడం చరణ్, వక్కల రాజయ్య, బాలరాజు, శివకుమార్, రవి, తిరుపతి రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

వృక్షవిలాపం



కుంటపల్లి చెరువు వద్ద బెరడు తీయడంతో ఎండిన వృక్షం

సంగెం: 'వృక్షాన్నిరా నేను వృక్షాన్నిరా.. మానవాళికి ప్రాణ భిక్షాన్నిరా' గేయం అందరికీ గుర్తుండే ఉంటుంది. మండు వేసవిలో దారిన పోయే మనుషులు, జంతువులు, పశువులకు నీడనీయడమే శాపమా? పక్షులకు నివాసంగా మారడమే నేరమా? పసుపు పచ్చని పూలు ఇచ్చి మండే ఎండలో ఆహ్లాదం పంచడమే తప్పా? అంటూ కుంటపల్లిలోని భారీ వృక్షం విలపిస్తోంది. తన చుట్టూ ఉన్న బెరడు తీసి ఎండిపోయేలా చేసింది ఎవరు అని ప్రశ్నిస్తోంది. సుమారు పదేళ్ల క్రితం హరితహారంలో చిన్న మొక్క నాటిన అధికారులు నాతో ఫొటోలు దిగారు. నేడు ఇంత వృక్షాన్ని ఎండిపోయేలా చేస్తే ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోతున్నది. ఇలానే వదిలివేస్తే తమ జాతికి ముందుగా, తర్వాత జీవకోటికి ముప్పుతప్పదని హెచ్చరిస్తోంది.

'రజతోత్సవ సభను విజయవంతం చేయండి'

నర్సంపేట : ఈనెల 27న నిర్వహించనున్న బీఆర్‌ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని పార్టీ పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణ గౌడ్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మునిగాల వెంకట్‌రెడ్డి కోరారు. పట్టణంలోని 4, 5, 8వ వార్డుల్లో గురువారం నిర్వహించిన సన్నాహక సమావేశాల్లో వారు మాట్లాడారు. బీఆర్‌ఎస్ పాలనలోఅందించిన సంక్షేమ పథకాలే పార్టీకి శ్రీరామరక్ష అని తెలిపారు. సమావేశాల్లో బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు, పార్టీ పట్టణ కమిటీ ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎడ్ల బండ్ల రైతులకు ఆహారం పంపిణీ



సభకు సూర్యాపేట నుంచి ఎడ్లబండ్లు వెళ్తున్నాయి. గురువారం సాయంత్రం వర్ధన్నపేటలో ఎడ్లబండ్లకు బీఆర్‌ఎస్ నాయకులు స్వాగతం పలికారు. నల్లగొండ జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రేగట్టి మల్లికార్జున్‌రెడ్డి సతీమణి శోభారెడ్డి రైతులకు ఆహార ప్యాకెట్లు, మజ్జిగ, తాగునీరు అందజేశారు. ఆమె వెంట మల్లికార్జున్‌రెడ్డి ఉన్నారు.

సరైన ప్రణాళికతోనే ఉత్తమ ఫలితాలు



విద్యార్థినులతో ప్రిన్సిపాల్ సువర్ణ, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది

- ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ సువర్ణ

నర్సంపేట : అధ్యాపకులు, ఉపన్యాసకులు, విద్యార్థులు సరైన ప్రణాళికతో ముందుకు సాగడం వల్లే ఇంటర్ పరీక్షల్లో విద్యార్థినులు ఉత్తమ ఫలితాలు సాధించారని స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సువర్ణ తెలిపారు. ఇంటర్ సెకండియర్ ఎంపీసీలో 759 మార్కులు సాధించిన సనప సృజన, బైపీసీలో 859 మార్కులు సాధించిన బంగారి నిహారిక, సీఈసీలో 886 మార్కులు సాధించిన, హెచ్‌ఈసీలో 890 మార్కులు సాధించిన కునుసోతు అంకిత, ఇంటర్ మొదటి సంవత్సరంలో 375 మార్కులు సాధించిన బత్తుల భానుమతి, బైపీసీలో 315 మార్కులు సాధించిన బండా సమత, సీఈసీలో 360 మార్కులు సాధించిన పోలెబోయిన వర్షిత, హెచ్‌లో 405 మార్కులు సాధించిన భూక్యా దేవిలను ప్రిన్సిపాల్ పుష్పగుచ్ఛాలు అందించి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సువర్ణ మాట్లాడారు. ఇంటర్ విద్య కమిషనర్ శ్రీకృష్ణ ఆదిత్య ఆదేశాల మేరకు 90, 30 రోజుల ప్రణాళికలు సిద్ధం చేయించి విద్యార్థులను ప్రణాళికాయుతంగా చదివించినట్లు తెలిపారు. అధ్యాపకుల నిరంతర పర్యవేక్షణ, స్టడీ అవర్స్ నిర్వహణ, ఉపన్యాసకుల సమష్టి కృషి, బాలికల పట్టుదలతోనే సత్ఫలితాలు సాధించగలిగామని స్పష్టం చేశారు. ఉపన్యాసకుల, అధ్యాపకుల, బాలికల తల్లిదండ్రుల చొరవ మరువలేనిదని ప్రశంసించారు. కళాశాల స్టాఫ్ సెక్రటరీ మల్లేశ్ చంద్ర మాట్లాడుతూ పల్లెల నుంచి వచ్చిన బాలికలు ఉత్తమ ఫలితాలు సాధించడం ఇతరులకు స్ఫూర్తినిస్తుందని చెప్పారు. విద్యార్థినులు చదువులోనే కాకుండా ఆటపాటల్లోనూ రాణిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు కృష్ణకుమారి, మహిపాల్, కృష్ణమోహన్‌సింగ్, వెంకట్‌రెడ్డి, రజిత, అనూష, బోధనేతర సిబ్బంది కోమల, యాదగిరి, ఆండాలు, జాఫర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణే ధ్యేయం

- కాంగ్రెస్ మండల ఇన్‌చార్జ్ రమేశ్



ప్రతిజ్ఞ చేస్తున్న రమేశ్, ఇతరులు

వర్ధన్నపేట : ఏఐసీసీ, టీపీసీసీ ఆదేశాల మేరకు రాజ్యాంగ, ప్రజాస్వామ్య పరిరక్షణే ధ్యేయంగా కాంగ్రెస్ 'జై బాపు, జై భీమ్, జై సంవిధాన్' కార్యక్రమం చేపట్టిందని ఆ పార్టీ మండల ఇన్‌చార్జ్ రమేశ్ గౌడ్ తెలిపారు. మండలంలోని చెన్నారంలో యూత్ కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షుడు బర్ల బాబు అధ్యక్షతన గురువారం నిర్వహించిన ర్యాలీలో రమేశ్ మాట్లాడారు. రాజ్యాంగం అమల్లోకి 75 గడచిన క్రమంలో దాన్ని నిర్వీర్యం చేసే దిశగా కేంద్రంలోని బీజేపీ తప్పుడు విధానాలు అవలంబిస్తోందని విమర్శించారు. అనంతరం నాయకులు, కార్యకర్తలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో నాయకులు ఎద్దు సత్యనారాయణ, అబ్బిడి రాజిరెడ్డి, ప్రసాద్, కర్ర మాలతిరెడ్డి, రవి, పోశాల వెంకన్న, కమ్మగోని ప్రభాకర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

'ముదిరాజ్'లను బీసీ'ఏ'లోకి మార్చాలి

- మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మదన్‌కుమార్



వలలతో స్వాగతం పలుకుతున్న నాయకులు

నల్లబెల్లి : ముదిరాజ్ కులస్తులను బీసీ'ఏ' కేటగిరీలోకి మార్చాని సీఎం రేవంత్‌రెడ్డిని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కాకతీయ యూనివర్సిటీ పాలక మండలి మాజీ సభ్యుడు డాక్టర్ గుండాల మదన్‌కుమార్ డిమాండ్ చేశారు. తెలంగాణ ముదిరాజ్ సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు దారం యువరాజు ఆధ్వర్యంలో మేడారం సమ్మక్క–సారక్క గద్దెల నుంచి చేపట్టిన మహాపాదయాత్ర మండలంలోని నల్లబెల్లి, రుద్రగూడెం గ్రామాల్లో గురువారం కొనసాగింది. ఈ సందర్భంగా పాదయాత్రకు నాయకులు రుద్రగూడెంలో వలలతో ఘనంగా స్వాగతం పకలగా మదన్‌కుమార్ మాట్లాడారు. ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా ముదిరాజ్ కులస్తులకు ఉద్యోగ నియామకాల్లో అన్యాయం జరుగుతోందన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలను అమలు చేయాలని, వెయ్యి కోట్ల రూపాయలతో కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహాసభ జిల్లా నాయకుడు సాంబయ్య, మండల అధ్యక్షుడు రాంబాబు, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు పద్మ, తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ వార్షికోత్సవం

నర్సంపేట : పట్టణంలోని మాంటిస్సోరి స్కూల్‌లో ప్రధానోపాధ్యాయురాలు కుంభం రజని అధ్యక్షతన గురువారం 10వ వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు సాంస్కృతిక నృత్యాలు, సాంప్రదాయ వేషధారణతో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా స్కూల్ చైర్మన్ ఎర్ర జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడారు. సుమారు 30 ఏళ్లుగా విద్యార్థుల ఉన్నతికి పాటుపడుతున్నట్టు తెలిపారు. అనేక మంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా, ఉన్నతులుగా తీర్చిదిద్దినట్టు చెప్పారు. కార్యక్రమంలో డైరెక్టర్లు ఎర్ర ఊర్మిళ, పాపిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

- కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న శ్రీనివాస్

పర్వతగిరి : ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే పంట ఉత్పత్తులకు మద్దతు ధర లభిస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జాటోతు శ్రీనివాస్ నాయక్ తెలిపారు. మండలంలోని గుగులోతుతండాలో చౌటపల్లి సొసైటీ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. గత ప్రభుత్వం తాలు, తరుగు పేరుతో రైతులను నిండా ముంచిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు మద్దతు ధరతోపాటు సన్నాలకు రూ.500 బోనస్ ఇస్తోందని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు భానోతు చందునాయక్, మహిళా విభాగం మండల అధ్యక్షురాలు మాసాని సువార్త, సొసైటీ సీఈఓ వెంకటయ్య, సెంటర్ ఇన్‌చార్జ్ కుమార్, కార్యదర్శి అరుణ, నాయకులు యాకూబ్, వీరన్న, మోతీలాల్, సునీల్, భద్రాసింగ్, రమేశ్, చల్ల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సేవా పుస్తకాల అందజేత



నర్సంపేట : కొత్తగా నియమితులైన ఉపాధ్యాయులకు చెన్నారావుపేట ఎంఆర్‌సీలో ఎంఈఓ బైరి సరళ గురువారం సేవా (సర్వీస్) పుస్తకాలు అందజేసి మాట్లాడారు. ఉద్యోగులకు సర్వీసు నమోదు కీలకమని చెప్పారు. ఉపాధ్యాయులు రిమార్కులు నమోదు కాకుండా విధుల పట్ల నిబద్ధతతో పని చేయాలని సూచించారు. అనంతరం పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఈదునూరి రవీందర్‌రెడ్డి మాట్లాడారు. ఉన్నత ప్రమాణాలతో విద్యాబోధన సాగించాలని సూచించారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో చొరవ చూపాలన్నారు. ఆ యూనియన్ మండల శాఖ అధ్యక్షుడు పూజారి సురేందర్ గౌడ్ మాట్లాడుతూ కొత్తగా విధుల్లో చేరిన ఎంప్లాయ్ ఐడీ, పాన్ కార్డు నంబర్, టీఎస్ జీఎల్ఐ నంబర్, క్యాడర్ స్ట్రెంత్, జీతాల చెల్లింపుల్లో యూనియన్ చొరవ చూపిందని తెలిపారు. నూతన ఉపాధ్యాయులకు పుస్తకాలు రాసి అందించడంలో యూనియన్ మాజీ ప్రధాన కార్యదర్శి నీలం రమేశ్ విశేష కృషి చేశారని చెప్పారు. అనంతరం నూతన ఉపాధ్యాయులు ఎంఆర్‌సీలో ఏర్పాటు చేసేందుకు బహుమతిగా గోడ గడియారం ఎంఈఓకు అందజేసి అతిథులను సత్కరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుధాకర్‌రెడ్డి, యూనియన్ ప్రధాన కార్యదర్శి భానోతు వెంకన్న, మండల శాఖ బాధ్యుడు చందావత్ ఈర్య, తదితరులు పాల్గొన్నారు.

మేడేను విజయవంతం చేయాలి

నర్సంపేట : వచ్చే నెల 1న కార్మికులు మేడే విజయవంతం చేయాలని సివిల్ సప్లై హమాలీ కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుంపెల్లి మునీశ్వర్ పిలుపునిచ్చారు. స్థానిక లారీ ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయంలో సంఘం మండల అధ్యక్షుడు ఓదెల కనకమల్లు అధ్యక్షతన గురువారం నిర్వహించిన సమావేశానికి మునీశ్వర్ మాట్లాడారు.

ఆర్థికసాయం

ఖానాపురం : మండలంలోని ధర్మరావుపేటకు చెందిన ఇంతల అశోక్, చరణ్ ఇటీవల నర్సంపేటలో రోడ్డు ప్రమాదానికి గురి కాగా వైద్యం కోసం బాధిత కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కొన్కటి రాజు ఆధ్వర్యంలో రూ.15 వేల సాయం విరాళాల ద్వారా సేకరించి గురువారం అందజేశారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



నర్సంపేట : సఖి సెంటర్ సేవలపై చెన్నారావుపేట మండలంలోని ఖాదర్‌పేట, ఝల్లి గ్రామాలలో సర్వోదయ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులతో కలిసి వాల్‌పోస్టర్లను లీగల్ కౌన్సిలర్ శోభారాణి, కేస్ వర్కర్ తిరుమల ఆవిష్కరించారు. అనంతరం శోభారాణి మాట్లాడారు. బాధిత మహిళలు, బాలికలు హెల్ప్ లైన్ నంబర్ 181కు ఫోన్ చేసి రక్షణ, సాయం పొందాలని సూచించారు.కార్యక్రమంలో చైల్డ్‌లైన్ సిబ్బంది సరిత, సుష్మ, సీసీ మంజుల, వీఓఏలు పర్వీన్, అస్మ, తదితరులు పాల్గొన్నారు.

గుడిసెవాసులకు పట్టాలిచ్చి ఇళ్లు కట్టించాలి



నర్సంపేట రూరల్ : నర్సంపేటలోని అంబేద్కర్ నగర్ గుడిసెవాసులకు పట్టాలిచ్చి పక్కా ఇళ్లు కట్టించాలని ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు కల్లెపల్లి ప్రణయ్‌దీప్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలోని బృందం తహసీల్దార్ రాజేశ్‌కు గురువారం వినతిపత్రం అందజేసింది. అనంతరం ప్రణయ్‌దీప్ మాట్లాడారు. సర్వే నంబర్ 813లోని ప్రభుత్వ భూమిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సామాజికవర్గాలకు చెందిన పేదలు నాలుగేళ్లుగా గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్నారని చెప్పారు. తాగునీటి, రోడ్లు, తదితర వసతులు లేక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఈనెల 30న తలపెట్టిన మహా ధర్మయుద్ధ సభను విజయవంతం చేయాలని కోరారు. డీపీ డీపీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు అందె రవి, జిల్లా అధ్యక్షుడు జలగం రమేశ్, ఎంఎస్‌పీ రాష్ట్ర నాయకుడు తడుగుల విజయ్, తదితరులు పాల్గొన్నారు.